క్లుప్తంగా

అత్యవసర వైద్యంపై అవగాహన



విద్యార్థులు, ఉపాధ్యాయులతో వైద్యుల బృందం

కర్నూలు(హాస్పిటల్): అత్యవసర పరిస్థితుల్లో అందించాల్సిన ప్రాథమిక వైద్యంపై సోమవారం స్థానిక ఎ.క్యాంపులోని మాంటిస్సోరి స్కూల్‌లో విద్యార్థులకు చిన్నపిల్లల వైద్యులు అవగాహన కల్పించారు. ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్, కర్నూలు ఆధ్వర్యంలో సీపీఆర్ యాక్టివిటీ గురించి ఉపాధ్యాయులకు, విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ డాక్టర్ విజయ్ ఆనంద్‌బాబు, సెక్రటరీ డాక్టర్ వీరరత్నాకర్‌రెడ్డి, ట్రెజరర్ డాక్టర్ ప్రకాశ్ ఆనంద్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కృష్ణ, డాక్టర్ లక్ష్మినారాయణ, పాఠశాల యాజమాన్యం రమాజ్యోతి, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

రెండు రోజులు నీటి సరఫరా బంద్

కర్నూలు (టౌన్): నగరంలో రెండు రోజుల పాటు నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మునగాలపాడు సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నుంచి అశోక్ నగర్ ఫిల్టర్ బెడ్‌కు నీటిని సరఫరా చేస్తున్న 1200 ఎంఎం డయా పైపులైన్ లీక్ అయ్యినట్లు పేర్కొన్నారు. దీని వల్ల ఈనెల 23, 24 తేదీల్లో మంచినీటి సరఫరాకు అంతరాయం ఉంటుందని తెలిపారు. నగర ప్రజలు నీటిని పొదుపుగా వాడుకొని నగరపాలక సిబ్బందికి సహకరించాలని కోరారు.

రోడ్డును నిర్మించాలి



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు శివారులోని జొహరాపురం నుంచి వెంకాయపల్లె వరకు దెబ్బతిన్న రోడ్డును బాగు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి, వర్గ సభ్యురాలు పి.నిర్మల డిమాండ్ చేశారు. రహదారిలో ఎక్కడ చూసినా గుంతలు ఉండటంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వెంటనే రహదారిని విస్తరించి ఇరువైపులా కాల్వల నిర్మాణాలను చేపట్టాలన్నారు. దీనిపై పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రహదారిని బాగుచేస్తే గుంటూరు-కర్నూలు రహదారిపై కూడా ట్రాఫిక్ తగ్గే అవకాశం ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వం రహదారులను బాగు చేస్తున్నామని చెబుతున్నా ఆచరణలో ఎక్కడా కనిపించడం లేదని మండిపడ్డారు. నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్, విజయ్ రామాంజనేయులు పాల్గొన్నారు.

గర్భధారణల మధ్య అంతరం ఉండాలి

కర్నూలు (సెంట్రల్): గర్భధారణల మధ్య అంతరం పాటించిన మహిళలకు ప్రోత్సాహకాలు ఇస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో వరల్డ్ పాపులేషన్ డే పురస్కరించుకుని.. గర్భధారణల మధ్య అంతరం పాటించిన మహిళలను లక్కీడిప్ ద్వారా ఎంపిక చేశారు. ఆదోని మున్సిపాలిటీకి చెందిన అయేషా బేగం, బి.ఉమ, జి.ఉమాదేవి, ఆలూరు మండలం పెద్దహొతూరుకు చెందిన మాలా మహేశ్వరి, కర్నూలు మున్సిపాలిటీకి చెందిన సుజాత ఎంపికయ్యారు. వీరికి రూ.5 వేలు చొప్పున ప్రోత్సాహకాన్ని కలెక్టర్ అందజేశారు. జేసీ డాక్టర్ బి.నవ్య, డీఎంహెచ్ఓ డాక్టర్ శాంతికళ తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతానందన్ మృతి తీరని లోటు

కర్నూలు(సెంట్రల్): కేరళ మాజీ సీఎం వీఎస్ అచ్యుతానందన్ మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటని సీపీఎం నాయకులు టి.రాముడు, వెంకటేశ్వర్లు, ఎండీ ఆనంద్‌బాబు, ఎండీ అంజిబాబు పేర్కొన్నారు. సోమవారం కార్మిక, కర్షక భవన్‌లో వీఎస్ అచ్యుతానందన్ మృతికి సీపీఎం సంతాపం ప్రకటించింది. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ.. కేరళలో అత్యంత ప్రజాదరణ ఉన్న నాయకుడిని కోల్పోవడం బాధాకరమన్నారు. అలాగే సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య అచ్యుతానందన్ మృతికి సంతాపం తెలిపారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు (న్యూటౌన్): అంగన్‌వాడీ వర్కర్లు, కేంద్రాల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సోమవారం విజయవాడలోని అసిస్టెంట్ డైరెక్టర్ ప్రవీణ, ప్రిన్సిపల్ సెక్రటరీ సూర్యకుమారిని కలిసి అంగన్‌వాడీ వర్కర్లు వినతిపత్రం అందజేశారు. మినీ టీచర్ల జీఓను రద్దు చేయాలని, యాప్స్‌ను సవరించి ఒకే యాప్ అమలు చేయాలని, గౌరవ వేతనాలు పెంచాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాలకు సన్న బియ్యం ఇవ్వాలని, మెనూ చార్జీలు పెంచాలని, ప్లేట్లు, గ్లాసులు, నాణ్యమైన యూనిఫామ్స్ ఇవ్వాలని కోరారు.

ప్రచారమే తప్ప.. పథకాలు ఏవీ?

- ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మోసాలను వివరిస్తాం
- బెదిరించాలని చూస్తే మరింత బలపడతాం
- కార్యకర్తలకు అండగా వైఎస్సార్‌సీపీ ఉంటుంది
- కూటమి మోసాలపై క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరించిన ఎస్వీ మోహన్ రెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి

కర్నూలు (టౌన్): ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రచార యావ తప్పా.. సంక్షేమ పథకాలు అమలు చేయడం చేతకాదని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి ఎద్దేవా చేశారు. సోమవారం స్థానిక పాతబస్తీలోని ఖడక్‌పురాలో నగరంలోని 1 నుంచి 11 వార్డుల వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో సమావేశంతో పాటు 'బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. సంక్షేమ పథకాలు అందక నష్టపోయిన విధానాన్ని వివరిస్తూ క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం పాలనలో పూర్తిగా విఫలమైందన్నారు. మరోవైపు ముఖ్యమంత్రి చంద్రబాబు అన్ని సంక్షేమ పథకాలు అమలు చేశామని, ఏవరైనా మాట్లాడితే నాలుక మడత పెడతామని బెదిరిస్తున్నారన్నారు. సూపర్ సిక్స్ హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయకపోగా, 'తల్లికి వందనం' పథకం మాత్రం అరకొరగా ఇచ్చి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. జగనన్న కంటే ఎక్కువ సంక్షేమ పథకాలు ఇస్తామని చంద్రబాబు హామీలు ఇచ్చి చేతులెత్తేశారని ఎద్దేవా చేశారు. ఇచ్చిన మాట ప్రకారం ఆడబిడ్డ నిధి కింద 18 ఏళ్లు నిండిన మహిళలకు ప్రతి నెలా రూ.1500, నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు భృతి, 50 ఏళ్లు దాటిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పెన్షన్, అన్నదాతలకు ఏడాదికి రూ.20 వేలు సాయం, ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. అలవిగాని హామీలతో అన్ని వర్గాలకు ఆశలు కల్పించిన ప్రభుత్వం అందరినీ నిరాశ పరిచిందన్నారు. కూటమి పార్టీల నాయకులు వచ్చే కార్పొరేషన్ ఎన్నికల్లో ఇంటింటికీ తిరిగి ఏ ముఖం పెట్టుకొని ఓట్లు అడుగుతారన్నారు. ప్రజా వ్యతిరేకతను చూసి ఆందోళనతోనే వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై దాడులు, కేసులతో ఇబ్బందులు సృష్టిస్తున్నారన్నారు. బెదిరిస్తే మరింత బలపడతామని స్పష్టం చేశారు. కేడీసీసీ బ్యాంకు మాజీ చైర్‌పర్సన్ విజయమనోహరి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అహమ్మద్ అలీఖాన్ మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారన్నారు. వైఎస్సార్‌సీపీ నేతలపై తప్పుడు కేసులు నమోదు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తే ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. కూటమి నాయకుల మాటలు నమ్మి మోసపోయామని ఏడాది పాలనలోనే మహిళలకు అర్థమైందన్నారు. గతంలో జగనన్న ఇంటి వద్దకే సంక్షేమ ఫలాలు అందించారని ప్రజలు గుర్తు చేసుకుంటున్నారన్నారు. కార్పొరేటర్లు ఆర్షియా ఫర్హీన్, జుబేర్, షాషా వలీ, నాయకులు షరీఫ్, కిషన్, రాఘవేంద్ర నాయుడు, పర్వతరెడ్డి శ్రీనివాసరెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాలనలో కూటమి విఫలం



కూటమి ప్రభుత్వ మోసాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి

- హామీల అమలు ఏదీ?
- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది దాటినా ఒక్క హామీ కూడా అమలు చేయలేకపోయారని, అరకొరగా అమలుచేసిన 'తల్లికి వందనం' పథకం అందరికీ వర్తించలేదని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం కల్లూరు అర్బన్ 33వ వార్డులో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ, ఇంటింటికీ వంచన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాటసాని రాంభూపాల్‌రెడ్డి వార్డులో పర్యటించగా ప్రజలు వివిధ సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. పాఠశాలలో పిల్లలకు ఇచ్చిన బ్యాగులు రెండు రోజుల్లోనే చిరిగి పోయాయని తెచ్చి చూపించారు. స్థానిక ఎమ్మెల్యే ఇంతవరకు కాలనీలోకి రాలేదని స్థానికులు కాటసానికి వివరించారు. ఈ సందర్భంగా కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. బాబు ష్యూరిటీ అని ప్రచారం చేసుకున్నారు తప్పా ప్రజలకు ఎక్కడా ష్యూరిటీ లేదని విమర్శించారు. కూటమికి అధికారం కట్టబెట్టి మోసపోయామని ప్రజలకు అర్థమైందన్నారు. నిరంతరం ప్రజల తరఫున వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుందన్నారు. ప్రజలకు ఎలాంటి పథకాలు అందించకపోయినా 'ఇది మంచి ప్రభుత్వం' అని ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పథకాలతో పాటు సూపర్ సిక్స్ పథకాలు ఇస్తామని ఎన్నికల్లో హామీలు ఇచ్చారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది గడిచాక వైఎస్సార్‌సీపీ పోరాటం చేయగా 'తల్లికి వందనం' పథకం మాత్రం అమలు చేశారని, అది కూడా అందరికీ ఇవ్వలేదని విమర్శించారు. దీపం పథకం సక్రమంగా అమలు కావడం లేదన్నారు. ఉచిత బస్సు ప్రయాణం పథకంపై కల్లబొల్లి మాటలు చెబుతున్నారని, ఎప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. అలాగే నిరుద్యోగ భృతి, అన్నదాత సుఖీభవ, ఆడబిడ్డ నిధి, 50 ఏళ్లకే పింఛన్ తదితర హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

నిత్యావసర సరుకుల ధరలు పెరిగాయి

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని కాలనీవాసులు మాజీ ఎమ్మెల్యే కాటసాని వద్ద గోడు వెల్లబోసుకున్నారు. ఎన్నికల్లో గెలిపిస్తే నిత్యవసర సరుకుల ధరలు తగ్గిస్తామని, స్మార్ట్ మీటర్లు బిగించమని ప్రగాల్భాలు పలికారని, అధికారంలోకి వచ్చాక ప్రజలను మోసం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. కార్పొరేటర్లు నరసింహులు, శ్రీనివాసులు, సుదర్శన్‌రెడ్డి, నారాయణరెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి శ్రమిద్దాం



ఎస్వీ మోహన్‌రెడ్డిని సత్కరిస్తున్న ఎర్రకోట జగన్ మోహన్‌రెడ్డి, తెర్నేకల్లు సురేందర్ రెడ్డి

కర్నూలు (టౌన్): జిల్లాలో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కలిసికట్టుగా మరింత శ్రమిద్దామని పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక గిప్సన్ కాలనీలోని ఎస్వీ స్వగృహంలో కర్నూలు పార్లమెంటు పార్టీ రాష్ట్ర కార్యదర్శులు తెర్నేకల్ సురేందర్ రెడ్డి, ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి తదితరులు పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డికి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. పదవులు పొందిన వారిని ఆయన సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ.. జిల్లాలో గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో పార్టీ క్యాడర్‌ను పూర్తి స్థాయిలో నియమించడంతో మరింత బలపడుతోందన్నారు. కూటమి ప్రభుత్వ అబద్ధపు హామీలు, మోసాలను ప్రజలకు వివరించి రానున్న మున్సిపల్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించుకుందామని పిలుపునిచ్చారు.

అరకొరగా వేతనాల పెంపు

కర్నూలు (టౌన్): రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ నాన్ పబ్లిక్ హెల్త్ వర్కర్లు రెండు నెలలుగా చేపట్టిన సమ్మె కారణంగా స్పందించిన ప్రభుత్వం వేతనాలను అరకొరగా పెంచడం తగదని కర్నూలు ప్రగతి సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.హర్ష సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మూడు కేటగిరీలకు రూ.3 వేలు మాత్రమే పెంచడం సరైంది కాదన్నారు. కార్మికులు ఆశించిన మేర కాకుండా మూడు వేలతో సరిపెట్టారని విమర్శించారు. అరకొరగా కాకుండా కార్మికుల డిమాండ్ మేరకు వేతనాలు పెంచేందుకు ప్రభుత్వం చొరవ చూపాలని డిమాండ్ చేశారు.

క్రీడాకారుడికి అభినందనలు

కర్నూలు సిటీ: ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీ బీఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న వై.మహేష్ అంతర్జాతీయ బాక్సింగ్ పోటీలకు ఎంపికయ్యారు. నేపాల్‌లో మంగళవారం నుంచి జరగనున్న పోటీలకు ఆయన సోమవారం బయలుదేరి వెళ్లారు. క్రీడాకారుడు మహేష్‌ను క్లస్టర్ వర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ వి.వెంకట బసవరావు, రిజిస్ట్రార్ కె.వెంకటేశ్వర్లు, ఆర్‌యూ రిజిస్ట్రార్ విజయ్‌కుమార్ నాయుడు తదితరులు అభినందించారు.

ఆశాల సమస్యల పరిష్కారానికి కృషి



ఆశాల నుంచి వినతి పత్రాలు స్వీకరిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళ

కర్నూలు(హాస్పిటల్): ఆశా కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళ చెప్పారు. సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఆశా కార్యకర్తలకు ఫిర్యాదుల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. ఆశాల సమస్యలపై వినతి పత్రాలను స్వీకరించి, వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చొరవ తీసుకుంటామని చెప్పారు. ఆశా కార్యకర్తలు అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను గ్రామ ప్రజలకు తెలియజేసి వారికి అన్ని ఆరోగ్య సేవలను అందించాలని సూచించారు. డీఐఓ డాక్టర్ నాగప్రసాద్‌బాబు, ఆర్‌బీఎస్‌కే పీఓ డాక్టర్ మహేశ్వరప్రసాద్, డీపీహెచ్ఎన్ఓ అన్నపూర్ణమ్మ, డీసీఎం ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ కుతుబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యలు పరిష్కరించండి



అర్జీదారులతో మాట్లాడుతున్న కమిషనర్ పి.విశ్వనాథ్

కర్నూలు (టౌన్): నగరంలోని 43వ వార్డులో శిథిలావస్థకు చేరుకున్న డ్రైనేజీలను బాగుచేయాలని స్థానికులు సురేష్, ఈశ్వర్, ఏసు విన్నవించారు. సోమవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ పాల్గొని ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలోని వివిధ కాలనీల ప్రజలు సమర్పించిన అర్జీలను పరిశీలించి, సమస్యలను ఆయా విభాగాల అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. డిప్యూటీ కమిషనర్ సతీష్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని...

- 19వ వార్డు చంద్రశేఖర్ నగర్‌లో డ్రైనేజీ కాల్వలు నిర్మించాలని స్థానికులు బి.శ్రీనివాసులు విన్నవించారు. ఇదే వార్డు సుద్దవాగు వంకను అనుకొని ఉన్న దేవాలయ సమీప ప్రాంతంలో చెత్తా చెదారం లేకుండా చూడాలని స్థానికులు శ్రీరాములు, పుల్లయ్యలు విన్నవించారు.
- నెహ్రూ నగర్‌లో ఎక్కువ ఎత్తులో ఉన్న డ్రైనేజీ కాల్వలను సరిచేయాలని స్థానికులు అమీర్, హైదర్ కోరారు.
- 19వ వార్డులోని రాంప్రియ నగర్‌లో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించాలని స్థానికులు ప్రవీణ్ రెడ్డి, గుర్రప్ప అభ్యర్థించారు.
- బుధవారపేట మారెమ్మ గుడి సమీపంలో తాగునీరు సక్రమంగా రావడం లేదని పరిశీలించి నూతన పైపులైన్ ఏర్పాటు చేయాలని పేరపోగు నరేష్, సురేష్, లక్ష్మీదేవి విన్నవించారు.
- 29వ వార్డు రాందాస్ నగర్‌లో సీసీ డ్రైన్ నిర్మించాలని స్థానికులు బిందు, విశ్వేశ్వర్ ఆచారీ, దిలీప్ కుమార్ రెడ్డి అర్జీ అందజేశారు.

ఎల్లో మీడియా రోత రాతలు తప్ప.. ఆధారాలేవీ?



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షరీఫ్, రాఘవేంద్రనాయుడు

కర్నూలు (టౌన్): ఎల్లో మీడియా రోత రాతలు తప్పా.. లిక్కర్ కేసు వ్యవహారంలో పార్లమెంటు సభ్యుడు మిథున్ రెడ్డి అక్రమాలు చేసినట్లు ఆధారాలేమున్నాయని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షరీఫ్ ప్రశ్నించారు. సోమవారం స్థానిక ఎస్వీ కాంప్లెక్స్‌లో పార్టీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని పక్కన పెట్టి వైఎస్సార్‌సీపీ అగ్రనేతలు, నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టడం, దౌర్జన్యాలు, బెదిరింపులకు పాల్పడటం, జైళ్లకు పంపడంతోనే కాలయాపన చేస్తోందని విమర్శించారు. సంబంధం లేని లిక్కర్ కేసులో మిథున్ రెడ్డిని అక్రమంగా అరెస్టు చేశారన్నారు. రాష్ట్రంలో నారా వారి రాజ్యాంగం నడుస్తోందన్నారు. నాలుగు రోజుల క్రితం బీసీ మహిళా జెడ్పీ చైర్‌పర్సన్ హారికపై దాడి కేసు మరువకముందే తాడిపత్రిలో ప్రభుత్వ ఉద్యోగి నాగరాజు నాయుడుపై జేసీ ప్రభాకర్ రెడ్డి దౌర్జన్యంగా వ్యవహరించడం, బెదిరింపులకు పాల్పడటం కూటమి పాలనకు నిదర్శనమన్నారు. కూటమి పాలనలో ఇబ్బందులు పడుతున్న ప్రజలను జగనన్న కలుస్తున్నాడని, ఆయనకు లభిస్తున్న ఆదరణను చూసి ప్రభుత్వానికి వణుకు పట్టుకుందన్నారు. తొలి అడుగు పేరుతో తెలు గు దేశం నిర్వహిస్తున్న కార్యక్రమానికి ప్రజల నుంచి స్పందన లేదని, ఏ ఇంటికి వెళ్లినా హామీలపై నిలదీస్తున్నారని, వారికిదే చివరి అడుగు అని విమర్శించారు.

జేసీ ప్రభాకర్ రెడ్డిని పార్టీ నుంచి బహిష్కరించాలి

వాల్మీకులు, డీపీఓ నాగరాజు నాయుడును పరుష పదజాలంతో బెదిరించిన తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డిని పార్టీ నుంచి బహిష్కరించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు రాఘవేంద్రనాయుడు డిమాండ్ చేశారు. కూటమి నేతల తీరుతో జిల్లా అధికారులు భయాందోళనల మధ్య పనిచేస్తున్నారన్నారు. రౌడీషీటర్లు ఊర్లో ఉంటే ఎస్పీ స్థాయి పోలీసు అధికారులు ఉద్యోగాలకు రాజీనామా చేయాల్సిన దౌర్భాగ్య పరిస్థితులు నెలకొన్నాయని మండిపడ్డారు. జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కర్‌యాదవ్, బీసీ సెల్ అధ్యక్షులు స్వాములు, కుర్ని నేష సంఘం నగర అధ్యక్షుడు నీలకంఠం పాల్గొన్నారు.

గడువులోపు పనులన్నీ పూర్తి కావాలి



మాట్లాడుతున్న సీఈ అశోక్‌కుమార్, చిత్రంలో ఎస్ఈ ప్రభాకర్‌రెడ్డి, ఇతర అధికారులు

అనంతపురం సిటీ: ఆంధ్రప్రదేశ్ రూరల్ రోడ్స్ ప్రాజెక్ట్ (ఏపీఆర్ఆర్‌పీ) కింద మంజూరైన పనులన్నీ వచ్చే ఏడాది మార్చి నెలాఖరుకల్లా పూర్తి చేయాల్సిందేనని సంబంధిత అధికారులను ఆ విభాగం ప్రాజెక్ట్ డైరెక్టర్, సీఈ అశోక్‌కుమార్ ఆదేశించారు. ఏపీ ఆర్ఆర్‌పీ రోడ్ల పురోగతిపై సీఈ కార్యాలయ ఈఈ రమణమూర్తితో కలసి అనంతపురం, శ్రీసత్యసాయి, కర్నూలు, నంద్యాల జిల్లాలకు సంబంధించిన పీఆర్ ఇంజినీరింగ్ అధికారులతో అనంతపురంలోని సర్కిల్ కార్యాలయంలో సోమవారం ఆయన సమీక్షించారు. అనంతపురం సర్కిల్ కార్యాలయ సూపరింటెండెంట్ ప్రభాకర్‌రెడ్డి, పీపీ రాజేంద్ర ప్రసాద్, పీఐయూ ఈఈ నవీన్‌కుమార్, ఈఈలు శంకరయ్య, రఘునాథరెడ్డి, డీఈఈలు, ఏఈఈలు హాజరయ్యారు. నాలుగేళ్లలో అనంతపురం జిల్లాకు సంబంధించి రూ.209 కోట్లతో 138 రోడ్లు మంజూరు కాగా, ఇప్పటి వరకు 52 పనులు పూర్తయ్యాయని, 42 పనులు ప్రోగ్రెస్‌లో ఉండగా, 44 పనులు రద్దయినట్లు ఇంజినీరింగ్ అధికారులు వివరించారు. మొత్తం రూ.101 కోట్లు ఖర్చు పెట్టి 195.71 కిలోమీటర్ల మేర రహదారులను నిర్మించినట్లు తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లాకు రూ.230 కోట్లతో 194 పనులు మంజూరు కాగా, 119 పనులు పూర్తయినట్లు ఇంజినీర్లు వివరించారు. 28 పనులు వివిధ దశల్లో ఉండగా, 47 పనులు రద్దయ్యాయని తెలిపారు. మొత్తం 193.91 కిలోమీటర్ల మేర రోడ్లు నిర్మించినట్లు పేర్కొన్నారు. అలాగే కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పరిస్థితిపైనా ఆయన సమీక్షించారు. అనంతరం ఆయా జిల్లాల ఇంజినీరింగ్ అధికారులనుద్దేశించి మాట్లాడారు. గడువులోపు పనులన్నీ పూర్తి చేయాల్సిందేనని స్పష్టం చేశారు. పనులు నాణ్యతగా లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉపాధ్యాయ సంఘాలతో డీఈఓ సమావేశం



మాట్లాడుతున్న డీఈఓ ఎస్.శామ్యూల్ పాల్

కర్నూలు సిటీ: జిల్లా విద్యాశాఖలో వివిధ అంశాలపై చర్చించేందుకు సోమవారం డీఈఓ ఎస్.శామ్యూల్ పాల్ ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం నిర్వహించారు. డీఈఓ మాట్లాడుతూ.. స్కూళ్లలో విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. బయోమెట్రిక్ హాజరు తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు. అలాగే బడి ఈడు పిల్లలందరూ బడిలో చేరేలా చూడాలన్నారు. కొన్ని అంశాల్లో జిల్లా వెనుకబడి ఉందని, సమన్వయంతో పనిచేసి వాటిని అధిగమించాన్నారు. పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకన రెమ్యునరేషన్ ఇంత వరకు రాలేదని ఆయా సంఘాల నాయకులు డీఈఓ దృష్టికి తెచ్చారు. త్వరలోనే రెమ్యునరేషన్ జమ చేస్తామని డీఈఓ హామీ ఇచ్చారు. డీఈఓ ఆఫీస్ సిబ్బంది, ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారంలో విఫలం

కర్నూలు(సెంట్రల్): రాష్ట్రంలో విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో ఆ శాఖ మంత్రి నారా లోకేష్ పూర్తిగా విఫలమయ్యారని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎండీ రఫీ విమర్శించారు. సోమవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..పెండింగ్‌లో ఉన్న రూ.6400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణకు చర్యలు తీసుకోవడం లేదని, ఫలితంగా కేజీ టూ పీజీ వరకు లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమ హాస్టళ్లలో కాస్మొటిక్, మెస్ చార్జీలను సక్రమంగా విడుదల చేయడం లేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న 2.5 లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వాలని లేదంటే నిరుద్యోగ భృతిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖలో సమస్యలు పరిష్కరించాల్సిన మంత్రి నారా లోకేష్ విదేశీ పర్యటనలతో సోకులు పడుతున్నారని విమర్శించారు. నాయకులు షాహీద్, సోమశేఖర్, మద్దిస్వామి, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

మెదడు జాగ్రత్త!

పెద్దాసుపత్రిలో ఆధునిక వైద్యసేవలు

- ఒత్తిడి తగ్గించుకుంటే మేలు
- ఈఈజీ, ఈఎంజీ పరీక్షలు నిర్వహణ
- ఉచితంగా రూ.50 వేల విలువైన ఇంజెక్షన్లు
- నేడు వరల్డ్ బ్రెయిన్ డే



కర్నూలు(హాస్పిటల్): మన శరీరం మొత్తంలో మెదడు అత్యంత ముఖ్యమైన భాగం. అలాంటి మెదడుకు ముప్పు వాటిల్లుతోంది. ప్రపంచవ్యాప్తంగా న్యూరో సంబంధిత సమస్యలు పెరుగుతున్నాయి. బ్రెయిన్ స్ట్రోక్, డిమెన్షియా, అల్జీమర్స్, బ్రెయిన్ ట్యూమర్ వంటి మెదడు వ్యాధులతో బాధపడుతున్న రోగుల సంఖ్య కూడా పెరుగుతోంది. ఈ వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఏటా జులై 22న ప్రపంచ మెదడు దినోత్సవం నిర్వహిస్తున్నారు.

మెదడు నాడీ ఆదేశ వ్యవస్థ కేంద్రం, సంక్లిష్టమైన పని ద్వారా ఆలోచనలు, జ్ఞాపకశక్తి కదలిక, భావోద్వేగాలు వచ్చేలా చేస్తుంది. శరీరంలోని అత్యంత ముఖ్యమైన అవయవాల్లో ఒకటి అయినప్పటికీ మెదడు ఆరోగ్యాన్ని చాలా మంది తేలిగ్గా తీసుకుంటారు. మెదడుకు సంబంధించి ఏ వ్యాధి వచ్చినా తేలిగ్గా తీసుకోకూడదు. రోగికి తలలో నిరంతరం నొప్పి, జ్ఞాపకశక్తి కోల్పోవడం, తల పరిమాణం పెరగడం, ఏదైనా ప్రమాదంలో తలకు గాయాలు లేదా గందరగోళ స్థితి ఉంటే ఇవన్నీ మెదడు వ్యాధుల లక్షణాలే. ఈ సందర్భంలో వెంటనే చికిత్స చేయించుకోవాలి. మెదడుకు సంబంధించిన అన్ని వ్యాధులూ ప్రమాదకరమైనవి. అందులో బ్రెయిన్ ట్యూమర్ కూడా ఒకటి. ఉదయం నిద్రలేవగానే విపరీతమైన తలనొప్పి వచ్చినా, మాట్లాడటం ఇబ్బంది ఉన్నా అవి బ్రెయిన్ ట్యూమర్ లక్షణాలుగా భావించి వెంటనే వైద్యులను సంప్రదించాలి. ముఖ్యంగా ప్రమాదకర ప్రాంతాల్లో పనిచేసే చోట, ద్విచక్ర వాహనాలపై ప్రయాణాలు చేసే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి.

న్యూరోసర్జరీలో ఆధునిక శస్త్రచికిత్సలు

న్యూరోసర్జరీ విభాగంలో అన్ని రకాల మెదడు, వెన్నుముకకు సంబంధించిన చికిత్సలు, శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నారు. ఈ విభాగంలో ప్రస్తుతం ప్రొఫెసర్ పోస్టు ఖాళీగా ఉంది. ఇన్‌చార్జ్ ప్రొఫెసర్, హెచ్ఓడీగా డాక్టర్ రామ్‌బాలాజీనాయక్ వ్యవహరిస్తున్నారు. ఆయనతో పాటు అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సురేంద్రవర్మ, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ పుండరీకాక్షయ్య, డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ అచ్యుత్, ఐదుగురు పీజీలు వైద్యసేవలు అందిస్తున్నారు. గతంలో నెలకు 85 నుంచి 100 వరకు ఆపరేషన్లు చేసేవారు. గత ఆరు నెలల నుంచి ఆపరేషన్ థియేటర్ మరమ్మతులకు గురి కావడంతో ఇతర ఆపరేషన్ థియేటర్‌లో పరిమితంగా చేస్తున్నారు. దీంతో ఆపరేషన్ల కోసం ఎదురుచూసే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. వైద్యుల సంఖ్య ఎక్కువగా ఉన్నా ఆపరేషన్ థియేటర్ అందుబాటులోకి రాకపోవడంతో రోగులకు పూర్తిస్థాయిలో వైద్యం అందడం లేదు.

ప్రైవేటులో పెరిగిన వైద్యులు

మెదడు, వెన్నుపూసకు సంబంధించిన వ్యాధులకు చికిత్స చేసే వైద్యులు పాతికేళ్ల క్రితం న్యూరాలజీ, న్యూరోసర్జరీకి ఒక్కొక్కరు చొప్పున ఉండేవారు. కానీ ఇప్పుడు ప్రభుత్వ ఆసుపత్రిలోనే వీరి సంఖ్య పదికి పైగానే ఉంది. ప్రైవేటులో మరో 30 మందికి పైగా న్యూరాలజీ, న్యూరోసర్జరీ విభాగాల్లో వైద్యులు తమ సేవలు అందిస్తున్నారు. ఒకప్పుడు హైదరాబాద్, చెన్నై వంటి మహానగరాల్లో జరిగే ఆధునిక శస్త్రచికిత్సలు ఆధునిక టెక్నాలజీ కారణంగా ఇప్పుడు కర్నూలులోనే నిర్వహించగలుగుతున్నారు.

న్యూరాలజీలో ప్రత్యేకంగా స్ట్రోక్ యూనిట్

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని న్యూరాలజీలో గత ప్రభుత్వ చొరవ కారణంగా పీజీ సీట్లు మంజూరయ్యాయి. వైద్యుల సంఖ్య సైతం పెరిగింది. ఆధునిక వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయి. ఇందులో ఫిట్స్, పక్షవాతం, పార్కిన్సన్, ఆప్టిక్ న్యూరైటిస్, న్యూరో మస్కులర్ డిసీజ్, మెడ నొప్పులు, కాళ్ల పాదాల నొప్పులు, సయాటికా, న్యూరోపతి వంటి అనేక రకాల నరాల జబ్బులకు చికిత్స అందిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రత్యేకంగా పది పడకలతో స్ట్రోక్ యూనిట్ ఏర్పాటు చేశారు. ఇందులో ఐసీయూ, వెంటిలేటర్లు ఏర్పాటు చేసి కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా రోగులకు సేవలు అందిస్తున్నారు. స్ట్రోక్ వచ్చిన వెంటనే ఇక్కడికి వస్తే రూ.50 వేల విలువ గల టీపీఏ (టిష్యూ ప్లాస్మినోజన్ యాక్టివేటర్) ఇంజెక్షన్‌ను ఉచితంగా వేస్తారు.

మెదడుకు గాయం కాకుండా చూసుకోవాలి



మన శరీరంలో మెదడు ముఖ్యమైన భాగం. దీనికి గాయం కాకుండా చూసుకోవాలి. న్యూరోసర్జరీ ఓపీ ప్రతి బుధ, శనివారం ఉంటుంది. ఆయా రోజుల్లో రోజుకు 200 నుంచి 250 మంది వస్తారు. ఇతర రోజుల్లో ఆయా వార్డుల నుంచి 10 నుంచి 15 మందికి ఓపీ సేవలు అందిస్తాం. ప్రస్తుతం ఆపరేషన్ థియేటర్ మరమ్మతుల్లో ఉన్నందున నెలకు 50 నుంచి 60 ఆపరేషన్లు చేస్తున్నాం. ఇందులో రోజుకొకటైనా బ్రెయిన్ ట్యూమర్ సర్జరీ ఉంటుంది. మిగిలినవి వెన్నుముక సర్జరీలు ఉంటాయి. అడ్వాన్స్ మైక్రోస్కోపీ అందుబాటులో ఉన్నా బ్రెయిన్, స్పయిన్ ఎండోస్కోపీ మిషన్లు కావాల్సి ఉంది.

– డాక్టర్ జి.రామ్‌బాలాజీనాయక్, న్యూరోసర్జరీ హెచ్ఓడీ, జీజీహెచ్, కర్నూలు

జీవనశైలిలో మార్పులు అవసరం



వరల్డ్ బ్రెయిన్ డే రోజున మెదడు రుగ్మతల భారాన్ని తగ్గించేందుకు ప్రపంచ వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. తద్వారా మెదడు వ్యాధులను ఎదుర్కోవడంలో ప్రజలకు సహాయపడుతుంది. అయితే శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడం చాలా ముఖ్యం. శరీరంలో ఏదైనా మెదడు రుగ్మత లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి. జీవనశైలి మార్పు ఎంతో ముఖ్యం. పోషకాలున్న ఆహారం తినాలి. రోజువారీ వ్యాయామం ఎంతో మంచిది. ఒత్తిడి తగ్గించుకోవాలి. రోజూ కనీసం 8 గంటలు నిద్రపోవాలి.

–డాక్టర్ నాగసురేష్, న్యూరాలజిస్టు, కర్నూలు